# పెళ్ళయితే భయం పోతుంది

అప్పయ్య మాస్టారు చాలా తెలివైన వారు కాని, గుండె ధైర్యం తక్కువ. నాలుగేళ్ళ బట్టి ఓ స్కూల్లో లెక్కలు మాస్టారుగా పని చేస్తున్నారు. ఆయన ఎంతో నిజాయితీగా అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్టు లెక్కలు చెప్పినా, విన్నది విన్నట్లు స్కూల్లోనే వదిలేసి యింటికి వెళ్ళిపోతున్నారు పిల్లలు! హోం వర్క్ చెయ్యరు సరికదా, చెయ్యలేదని భయపడరు కూడా!

ఓ సారి డి.యి.ఓ.గారు స్కూల్ తనిఖీకి వచ్చారు. ఈయన అడిగిన ప్రశ్నలకి పిల్లలు సరియైన సమాధానాలు చెప్పకపోతే తనకి ఉద్యోగ భంగం కలుగుతుందన్న భయం పట్టుకుంది అప్పయ్య మాస్టారికి! ఎదురెళ్ళి నమస్కారం పెట్టారు. మాస్టారి పేరు తెలుసుకుని, "స్కూల్ తనిఖీ మీ క్లాసులోనే మొదలు పెడదాం మాస్టారు" అన్నారు డి.ఇ.ఓ.

అప్పయ్యగారు అతిగా భయపడుతూ దీనంగా పెట్టారు తన మొహం! ఏదైనా ఈ సంవత్సరం ఇంక్రిమెంట్ యివ్వకపోవడం వలన మాస్టారి మొహం కళా విహీనంగా ఉందేమో అనుకున్నారు డి.ఇ.ఓ.! హెడ్ మాస్టారి మొహం కేసి చూశారు. హెడ్ మాస్టారు అప్పయ్యగార్ని చూస్తూ, "ఎందుకు మాస్టారూ అలా ఉన్నారు, మన డి.ఇ.ఓ సార్ చాలా మంచివారు, కారణం లేకుండా ఎవర్నీ బాధపెట్టరు, ధైర్యంగా ఉండండి!" అన్నారు.

"ఆ! మీరే సబ్జెక్ట్ చెపుతున్నారు మాస్టారు!" అన్నారు డి.ఇ.ఓ

"లెక్కలు సార్! "పిల్లల్ని వేసిన ప్రశ్నలకి వాళ్ళు సరియైన సమాధానాలు చెప్పకపోతే తన పీకల మీదకి వస్తుందన్న భయంతో, ఎందుకైనా మంచిదని", ఎంతగా చెప్పినా పిల్లలు సరిగ్గా చదవడం లేదు"! అన్నారు, అప్పయ్యగారు.

"అదిగో అక్కడే వచ్చింది ముప్పు! మీరు చెప్పేది లెక్కలు అంటున్నారు! లెక్కలు ఎవరైనా చదువుతారా, చేస్తారు గాని! అసలు మనం చెప్పేది వాళ్ళు "చెయ్యాలా చదవాలా" అన్న విషయం గురించి ముందు మనకి అవగాహన ఉండాలి!" అంటూ, ఈ విషయం మాస్టారికి చెప్పవలసిన బాధ్యత మీకు లేదా! అన్నారు హెడ్ మాస్టారితో.

"అయ్యా చిత్తం ఎంతో మంది స్కూల్ తనిఖీ చేశారు గాని ఈ విషయం ఎవ్వరూ సెలవివ్వలేదు సార్! ఇక ఈ విషయం మా జీవితంలో మరచిపోం సార్! అన్నారు హెచ్.ఎమ్ గారు వినయంగా.

"అదేమరి! నేను చదువుకునే రోజుల్లో మా ఉపాధ్యాయులంతా. నామెదడుని ఓ "పాదరసం" అనేవారు. ఉద్యోగంలో చేరిన పదేళ్ళకే డి.ఇ.ఓ అయిపోయాను!"

"అందుకే ముఖే ముఖే సరస్వతీ అన్నారు. మీ నుదిటి పై సరస్వతీ దేవి తేజస్సుతో తాండ విస్తోంది!" అన్నారు హెచ్.ఎమ్‌గారు "నీ రూమ్‌కి నడువు! తనిఖీ తర్వాతా చేద్దాం! అంటూ, ఎమిటోనయ్యా! తనిఖీ మొదలు పెట్టిన వేళా విశేషం సరిగ్గా లేనట్లుంది! నీ కొక విషయం చెపుతాను, ఎవరితోనూ అనకు! ఇంట్లో నా భార్య రోజూ సంక్రాంతికి పట్టుచీర కొనమని, తన మొహం దీనంగా పెట్టుకుని, యింట్లో నా చుట్టూ తిరుగుతోంది.! ఆ దీన వదనం చూడాలేక, ప్రస్తుతం తప్పించకుందామని ఈ తనిఖీ పనిమీద బయల్దేరాను ఇక్కడ కొస్తే అప్పయ్యగారి దీన వదనం చూడవలసి వచ్చింది. అది సరే కాని, ఈ ఊళ్ళో మంచి భోజన హోటల్ ఉందా"

"అయ్యో ఎంత మాట సార్! మీరు మా స్కూల్‌కి రావడమే విశేషం! భోజనం మా యింట్లో తయారు చేయిస్తున్నాను. నా అదృష్టం! నా భార్య ఈ రోజే పుట్టింటి నుంచి వచ్చింది!"

"మీ దంపతులకి నా ఆశీర్వచనాలు!"

భోజనం అయిన తర్వాత అప్పయ్య మాస్టార్ని పిలిపించారు డి.ఇ.ఓ.

ఏం పీకల మీదకి వచ్చిందోనని భయపడుతూ వచ్చారు, అప్పయ్యగారు.

"మిస్టర్ అప్పయ్యా! పిల్లలు చదవకపోతే మరీ మనస్సులో దిగులు పెట్టకోకు! నీ ఆరోగ్యం పాడవుతుంది...' అని చెపుతూంటే,

"పిల్లలు చదవకపోతే" అని, ఆయన డి.ఇ.ఓ కనక అనవచ్చు అదేమనం అంటే తప్పు!" అనుకున్నారు అప్పయ్య స్వగతంగా.

"ఆ! బై ది బై మీకు పెళ్ళయ్యిందా!" అన్నారు డి.ఇ.ఓ.

తన చుట్టాలలో ఏ సంబంధంమైనా చూసి అంటకడతాడేమోనన్న భయంతో, "ఓ పదిరోజుల క్రితమే నిశ్చయ తాంబూలాలు తీసుకున్నాం సార్! అన్నారు అప్పయ్య.

"శభాష్! పెళ్ళయితే మొదటి సంవత్సరం భయంగా వుంటుంది. తర్వాత అన్ని భయాలు పోతాయి. ఒక విధమైన మొండి ధైర్యం వచ్చేస్తుంది కొన్నాళ్ళకి అన్నారు డి.ఇ.ఓ.

"నేను అదే చెప్పానండి!" అన్నారు హెచ్.ఎమ్. "నేను చెప్పవలసినది నువ్వెందుకు చెప్పావ్, అంటే నువ్వు నేనూ సమానమా!" అని లోపల చింతిస్తూ, పైకి మాత్రం "వెరీగుడ్" అన్నారు డి.ఇ.ఓ. తనిఖీ ముగించుకుని తరలిపోయారు డి.ఇ.ఓ.

"అదేమిటయ్యా! నన్ను పిలవకుండానే, నిశ్చయ తాంబూలాలు తీసేసుకున్నావ్! " అన్నారు హెచ్.ఎమ్.

"క్షమించాలి! ఎక్కువ మందిని తీసుకురావద్దన్నారు కాబోయే మామగారు

"ఫర్వాలేదులే! పెళ్ళికి మాత్రం నన్నూ డి.ఇ.ఓ గార్ని పిలిచి, ఆయనకు మాత్రం బట్టలు పెట్టు!

"అలాగే సార్"

ఇదంతా చూస్తే ఇక పెళ్ళితప్పేటట్లు లేదనుకున్నారు అప్పయ్యగారు. కాని ఒక భయం మాత్రం ఆయనని ఆవహించింది! అసలు ఈ స్కూల్ పిల్లలతోనే చస్తూంటే, తనకి కలిగిన సంతానం కూడా ఏడిపించుకుతింటే ఏం చెయ్యాలా అని!

అప్పయ్య మాస్టారు నిశ్చయతాంబూలాలు తీసుకున్నట్లు చుట్టుపక్కల స్కూళ్ళలో తెలిసిపోయింది.! ఇక బాగుండదని, ఓ సంబంధం ఖాయం చేసుకుని పెళ్ళి ముహూర్తం పెట్టించేశుకున్నారు.. అప్పయ్యగారు.

పెళ్ళి వైభవంగా జరిగింది! ఎప్పుడూ స్కూల్‌కి సరిగ్గా రాని పిల్లలు కూడా పెళ్ళికి వచ్చి పప్పన్నం తిన్నారు. డి.ఇ.ఓ గారు ఆశీర్వదిస్తూ "లెక్కలు చదవాలా, చెయ్యాలా "మొదలైన విషయాలు మరచిపోయి, హాయిగా ఓ నెల సెలవు పెట్టి సుఖంగా ఉండు మిష్టర్ అప్పయ్యా! అన్నారు.

"నేను ఈ విషయం ముందే చెప్పానండీ! అన్నారు హెచ్.ఎమ్. "అంటే నువ్ నాతో సమానమా!" అని మొహం చిట్లించారు, డి.ఇ.ఓగారు.

ఓ నాలుగేళ్ళ తర్వాత డి.ఇ.ఓ మళ్ళీ స్కూల్ తనిఖీకి వచ్చారు.

"మిష్టర్. అప్పయ్యా ఎలా ఉంది వైవాహిక జీవితం!" అన్నారు.

"ఇంట్లో పిల్లలకి కూడా క్రమశిక్షణ లేదు సార్"

"ఏం బాధపడకు! పిల్లలంతే! నీ చిన్నతనం గుర్తు చేసుకో!"

"భలే చెప్పారు సార్! అన్నారు హెచ్.ఎమ్. ముసి ముసిగా నవ్వుతూ, డి.ఇ.ఓ. గారి తనిఖీ సజావుగా సాగిపోవాలని!.

రంజని(ఉగాది 2013)